ప్రజల చేతిలో

www.ayudamdaily.com

ఆయుధం

The Common People's Voice

శనివారం | జూన్ 06, 2026 | సంపుటి : 7 | సంచిక : 08 | పేజీలు : 2

అడవుల పరిరక్షణతోనే పర్యావరణ సమతుల్యత

- పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలి.
- అరుదైన ప్రాంతం ములుగు
- రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క.

2 లో

ప్లాస్టిక్‌కు శవయాత్ర.. ప్రకృతికి జీవయాత్ర

- అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా..
- జ్వాల సంస్థ ఆధ్వర్యంలో వినూత్న ర్యాలీ
- ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ నిషేధించాలి
- జ్వాలా అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్

హనుమకొండ, ఆయుధం: ప్లాస్టిక్ అనర్థాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేలా అవినీతి వ్యతిరేక సంస్థ జ్వాల వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్లాస్టిక్‌కు శవయాత్ర ప్రకృతికి జీవయాత్ర" పేరుతో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం (జూన్ 5) సందర్భంగా శుక్రవారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీ వెయ్యి స్తంభాల గుడి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ప్లాస్టిక్ వ్యర్థాలతో నిర్వహించిన ఈ శవయాత్ర విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జ్వాల వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ మాట్లాడుతూ.. రోజురోజుకు పెరుగుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలతో గాలి, నీరు, వాయు కాలుష్యం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలో తడి చెత్త, పొడి చెత్త అని ప్రజల నుంచి సేకరిస్తున్నా.. వాటిని రీసైకిలింగ్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగిస్తున్న దుకాణదారులపై జరిమానా విధిస్తున్న అధికారులు.. నిషేధిత ప్లాస్టిక్‌ను తయారు చేసే పరిశ్రమల పై చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వినియోగం మన జీవితంలో భాగమైపోయిందని.. క్యాన్సర్ లాంటి అనేక ప్రాణాంతక వ్యాధులకు ఇది కారణంగా మారిందన్నారు. ప్లాస్టిక్ నిషేధం పై కఠిన చట్టాలు ఉన్నప్పటికీ.. అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ప్రశాంత్ ఆరోపించారు. కనీసం ప్రభుత్వ శాఖలో అయినా ప్లాస్టిక్‌ని పూర్తిగా నిషేధించాలని, ప్లాస్టిక్ అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎల్‌బీ కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ సదానందం, జ్వాల సంస్థ సభ్యులు అచ్చే అమర్‌నాథ్, బుర్రి కృష్ణమూర్తి, ప్రకాష్, గుండపు సాయిచంద్, రవీందర్, రాజు పాల్గొన్నారు.

అధికారం లేకున్నా పేదల పక్షానే కమ్యూనిస్టులు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- ముగిసిన వరంగల్ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు

నల్లబెల్లి, ఆయుధం: అధికారం ఉన్నా, లేకున్నా పేద ప్రజల పక్షాన పోరాటం చేసేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని సుమంగళి ఫక్షన్ హాల్లో జరుగుతున్న సిపిఐ రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు హజరై మాట్లాడారు. శిక్షణ శిబిరంలో భారత స్వాతంత్ర్య ఉద్యమం సిపిఐ పార్టీ పాత్ర అనే అంశంపై జితేందర్ రెడ్డి బోధించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రపంచంలో పేద ప్రజలకు, కార్మికులకు అండగా ఉండేది ఎర్ర జెండా పార్టీలేనని గుర్తు చేశారు. భారత దేశంలో ఉన్న భూర్జువా పార్టీలు కేవలం దేశం వరకే ఉంటాయని, కమ్యూనిస్టు పార్టీ మాత్రం ప్రపంచ వ్యాప్తంగా ఉంటుందని చెప్పారు. పుడితే కమ్యూనిస్టుగా పుట్టాలని, ధనవంతుల పార్టీలకు వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు పేద ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎర్ర జెండాను కడుపులో పెట్టుకొని కాపాడుకోవాలని జాలిలేని కాంగ్రెస్, బిజెపి పార్టీల నాయకులు ప్రజల పన్నులతో

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

2 లో

పాలమూరు రంగారెడ్డి తో కేసీఆర్ ఇంట్లో.. కనకవరం

వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకు నీళ్లివ్వలేదు ష

- ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ప్రాజెక్టుల సందర్శన
- రెండో రోజు పాలమూరు రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పనుల పరిశీలన
- సీఎం రేవంత్ రెడ్డి

మహబూబ్‌నగర్, ఆయుధం;

బీఆర్ఎస్ హయాంలో కమీషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాజెక్టులను సందర్శిస్తున్న సీఎం.. రెండోరోజు పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. అనంతరం కరివెన రిజర్వాయర్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

''ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టులూ పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. పంపులు, లిఫ్ట్ పనుల్లో అవినీతిపై మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఏళ్ల తరబడి పోరాడారు. జిల్లా నలుమూలలా తిరిగి ప్రాజెక్టు పనులను కొలిక్కి తెచ్చే ప్రయత్నం చేస్తున్నా. మేం పనులు చేపడుతుంటే వాళ్లు రాజకీయ కార్యాచరణ చేపడుతున్నారు. సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి క్షేత్రస్థాయి పర్యటన చేశా. పనులు పరిశీలించి భవిష్యత్‌లో ఎలాంటి చర్యలు చేపట్టాలనేదానిపై నిర్ణయం తీసుకుంటాం.

అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారు

కష్టకాలంలో పాలమూరు నుంచి కేసీఆర్‌ను ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తారని ఆశించాం. కృష్ణా జలాలు పూర్తిగా జిల్లాలో ప్రవహించినా ఎన్నడూ ఒడిసి పట్టుకోలేదు. కేసీఆర్ సీఎం అయ్యాక పాలమూరు ప్రాజెక్టులు పూర్తిచేస్తారనుకున్నాం. ప్రాజెక్టుల గురించి ప్రశ్నిస్తే అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారు. పాలమూరురంగారెడ్డి పూర్తయితే 26 లక్షల ఎకరాలకు ఆయకట్టు వచ్చేది. రూ.27వేల కోట్లు ఖర్చు చేసి పంపులు, లిఫ్ట్ పనులు పూర్తిచేశారు. ఈ పనులతో కేసీఆర్ ఇంట్లో కనకవర్షం కురిసింది. కమీషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదు. జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. కానీ.. ప్రాజెక్టులు పూర్తయినట్లు కేసీఆర్ ఎలా భావించారు?

నాపై కోపంతో ఆ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ తొక్కిపెట్టారు

మేం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుల కోసం రూ.22వేల కోట్లు ఖర్చు చేశాం. వీటిలో రూ.8 వేల కోట్లు ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఇచ్చాం. ఈ జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కావాలంటే 4వేల ఎకరాల భూసేకరణ చేయాలి. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ చేయకుండా రిజర్వాయర్లలో నీళ్లు నింపగలమా?రెండేళ్లలో పనులు పూర్తిచేయాలని కంకణం కట్టుకుని ముందుకెళ్తున్నాం. గతంలో విపరీతంగా అప్పులు తేవడం వల్ల ఇప్పుడు ప్రాజెక్టులకు అప్పులు తెచ్చుకోలేని పరిస్థితి వచ్చింది. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.55వేల కోట్ల అంచనా వేసి రూ.27వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 50 శాతం నిధులూ ఖర్చు పెట్టకుండా 90 శాతం పనులెలా పూర్తవుతాయి? ఉన్నదంతా దోచుకుని మమ్మల్ని దోషులుగా నిలబెడదామనే భ్రమల్లో ఉన్నారు. నాపై కోపంతో మక్తల్‌నారాయణపేటకొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ తొక్కిపెట్టారు. బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలకు పైసా విలువ లేదు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం. భూసేకరణకు రూపాయి ఎక్కువైనా ఇచ్చి సమస్యలు పరిష్కరిస్తాం. జిల్లాలో ప్రాజెక్టుల పూర్తికి సంపూర్ణంగా కట్టుబడి ఉన్నాను. తక్కువ భూసేకరణతో ఎక్కువ నీళ్లు నిల్వ చేసుకునే ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేస్తాం. కర్ణాటకతో సమన్వయం చేసుకుని ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. బ్రిడ్జ్ కమ్ బ్యారేజీల కోసం అధ్యయనం చేస్తున్నాం. పనులకు అడ్డుపడకుండా ఉండాలని బీఆర్ఎస్ నేతలను కోరుతున్నా. ఆ పార్టీ నేతల వ్యాఖ్యలకు పైసా విలువ లేదు. కేసీఆర్ రద్దయిన వెయ్యి రూపాయల లాంటివారు. బీఆర్ఎస్ పార్టీకి, నేతలకు గతమే ఉంది.. భవిష్యత్తు లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ప్రాజెక్టయినా మొదలుపెట్టి పూర్తి చేసిందా చెప్పాలి. ప్రాణహితచేవెళ్ల పేరు, ఊరు మార్చి దోపిడీ చేయడమే కేసీఆర్‌కు తెలుసు. ఆయన సొంతంగా మొదలుపెట్టిన ప్రాజెక్టు ఒక్కటీ రాష్ట్రంలో లేదు. కాళేశ్వరం కూలిన తర్వాత చుక్క నీళ్లు తీసుకోకుండా ఎక్కువ వరి ఉత్పత్తి చేశాం''అని రేవంత్ అన్నారు.

ఆధునిక సదుపాయాలతో ఆఫీసర్స్ క్లబ్ అభివృద్ధి

- అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

హనుమకొండ, ఆయుధం: వరంగల్ ఆఫీసర్స్ క్లబ్‌లో చేపట్టనున్న పలు నూతన అభివృద్ధి పనులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ, ఆఫీసర్స్ క్లబ్‌ను మరింత ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి సభ్యులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. క్లబ్ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని పేర్కొన్నారు. క్లబ్ అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం సభ్యులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అమ్మ పేరుతో ఒక మొక్క

- మొక్కలు నాటడమే కాకుండా... వాటి సంరక్షణ కూడా మన బాధ్యత!
- బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్

2 లో

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలి

- మాజీ కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్

హనుమకొండ, ఆయుధం: ప్రతి ఒక్కరూ చెట్లు నాటి, వాటిని సంరక్షించాలని మాజీ కుడా చైర్మెన్, ఓబీసీ చైర్మెన్, మాస్టర్జీ విద్యా సంస్థల చైర్మెన్ సుందర్‌రాజ్ యాదవ్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ధర్మసేతు గ్లోబల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి పౌరులు తమ పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి ప్రత్యేక సందర్భాల్లో కనీసం ఒక్క చెట్టైనా నాటితే దేశవ్యాప్తంగా కోట్ల సంఖ్యలో చెట్లు పెరిగి పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ధర్మసేతు గ్లోబల్ వెల్ఫేర్ సొసైటీ చేస్తున్న కృషిని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ రిటైర్డ్ ప్రొఫెసర్, ఓబీసీ సెక్రటరీ గడ్డం భాస్కర్, సీనియర్ పాత్రికేయులు గడ్డం కేశవమూర్తి, ధర్మసేతు గ్లోబల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు శ్రీకాంత్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఓబీసీ కార్యాలయం పక్కన మొక్కలు నాటారు.

టెండరు విధానం రద్దు చేయాలి

- టెస్కో ద్వారానే కొనుగోలు చేసే దాకా ఉద్యమాలు
- ఉధృతంగా నిర్వహించాలి
- ఐదో రోజు మగ్గాల బంద్ విజయవంతం
- చేనేత పరిరక్షణ సదస్సులో వక్తలు

2 లో

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

- అదనపు కలెక్టర్ రవి
- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వనమహోత్సవం

ప్రకృతి ప్రాణము లాంటిది

- ప్రిన్సిపాల్ కే. బిక్షాలు

హనుమకొండ, ఆయుధం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కే. బిక్షాలు శుక్రవారం మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో కాలుష్య నివారణకు ప్రకృతిని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని నేటి మొక్కలే రేపటి వృక్షాలుగా మారి ప్రకృతికి ఉపయోగపడతాయని అన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో సూపరింటెండెంట్ వీరు నాయక్ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొని మొక్కలు నాటారు.

వేలేరులో పర్యావరణ దినోత్సవం

వేలేరు, ఆయుధం: వేలేరు మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని.. నీటిని, విద్యుత్తును వృధా చేయకుండా కాపాడాలని ఈ సందర్భంగా గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకర్, జీపీ కార్యదర్శి విజయ, వార్డు సభ్యులు సురేష్, సునీల్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

'అమ్మ పేరుతో ఒక మొక్క' కార్యక్రమం

- **మొక్కలు నాటడమే కాకుండా... వాటి సంరక్షణ కూడా మన బాధ్యత!**
- **బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్**

వరంగల్, ఆయుధం: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, కన్నతల్లిని గౌరవిస్తూ ప్రకృతిని కాపాడుకోవాలనే ఉన్నత ఆశయంతో గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన "అమ్మ పేరిట ఒక మొక్క" (ఏక్ పేడ్ మా కే నామ్) కార్యక్రమం దేశవ్యాప్తంగా విప్లవాత్మక మార్పులు తెస్తోందని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పేర్కొన్నారు. బీజేపీ వరంగల్ జిల్లా కన్వీనర్ కనుకుంట రంజిత్, కాశిబుగ్గ మండల అధ్యక్షులు అపురూప రజనీష్ ఆధ్వర్యంలో కాశీబుగ్గ సొసైటీ కాలనీ హిందూ స్మశాన వాటికలో నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఒక మొక్కను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "12 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాలలో సమగ్ర అభివృద్ధి సాధించింది. ఈ ప్రగతి ప్రస్థానంలో పర్యావరణ సమతుల్యతకు మోదీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. పెరుగుతున్న కాలుష్యాన్ని, గ్లోబల్ వార్మింగ్‌ను అరికట్టడానికి 'అమ్మ పేరుతో ఒక మొక్క' ప్రచారం ఒక సంజీవనిలా పనిచేస్తోంది. పర్యావరణ పరిరక్షణతో పాటు మాతృమూర్తిని స్మరించుకునేలా ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ప్రధాని నరేంద్ర మోదీ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. వరంగల్ జిల్లాలోని ప్రతి బీజేపీ కార్యకర్త, నాయకులు, సాధారణ ప్రజలు తమ మాతృమూర్తి పేరు మీద కనీసం ఒక మొక్కనైనా నాటి, దాన్ని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, పర్యావరణ సమతుల్యత లోపించడం వంటి సమస్యల నివారణకు పెద్ద ఎత్తున వృక్షోపణ జరగాలని, వరంగల్ జిల్లాను హరిత జిల్లాగా మార్చడానికి తమ వంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు. జన్మనిచ్చిన తల్లిని గౌరవిస్తూ, మనకు జీవాన్నిచ్చే ప్రకృతి మాతను కాపాడుకోవడమే ఈ వినూత్న కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని గంట రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు బైరి నాగరాజు, జిల్లా కార్యదర్శి గోకే వెంకటేష్, జిల్లా నాయకులు ఎరుకుల రఘునారెడ్డి, మాదాసు రాజు, మందాటి మహేందర్, గుర్రపు సత్యనారాయణ, వంచనగిరి రాజ్ కుమార్, మండల నాయకులు అల్లి అజయ్, మామిడాల సతీష్, కందుకూరి శ్రీనివాస్, ప్రభాకర్, రాము, అనిల్ పాల్గొన్నారు.

భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

హనుమకొండ, ఆయుధం: భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, కాలుష్య రహిత పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అధికారులు, సిబ్బందితో కలిసి పండ్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా అటవీ సంపద క్రమంగా తగ్గిపోతుండటం, పచ్చదనం స్థానంలో కాంక్రీట్ నిర్మాణాలు పెరుగుతుండటం, వాహనాలు, పారిశ్రామిక ప్రాంతాల నుంచి

వెలువడుతున్న కాలుష్యం కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందన్నారు. దీనివల్ల వాతావరణ పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని, సమయానికి వర్షాలు కురవకపోవడం, అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం వంటి పరిణామాలు ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులకు ప్రధాన కారణం పచ్చదనం తగ్గిపోవడమేనని పేర్కొన్న ఆయన, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. విస్తృత స్థాయిలో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం ద్వారా రాబోయే తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు అంకిత్ కుమార్, దారా కవిత, అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీలు నర్సింహారావు, నాగయ్య, అంతయ్య, సురేంద్ర, ఆర్ఐలు సతీష్, శ్రీనివాస్, చంద్రశేఖర్, శ్రీధర్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టెండర్ విధానం రద్దుచేయాలి

- **టెస్కో ద్వారానే కొనుగోలు చేసే దాకా ఉద్యమాలు ఉధృతంగా నిర్వహించాలి**
- **ఐదో రోజు మగ్గాల బంద్ విజయవంతం**
- **చేనేత పరిరక్షణ సదస్సులో వక్తలు**

వరంగల్, ఆయుధం: టెండర్ విధానం రద్దుచేసి, టెస్కో ద్వారానే కొనుగోలు చేసే దాకా ఉద్యమాలు ఉధృతంగా నిర్వహించాలని చేనేత పరిరక్షణ సదస్సులో వక్తలు పేర్కొన్నారు. ప్రభుత్వం టెండర్ విధానాన్ని రద్దుచేసి బెడ్ షీట్లు కార్పెట్స్ టెస్కో ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి మొరపెట్టుకున్న స్పందించకపోవడాన్ని నిరసిస్తూ వరంగల్ కొత్తవాడలో ఒకటవ తేదీన మొదలైన మగ్గాల బంద్ ఐదో రోజు శుక్రవారం జయప్రదంగా జరిగింది. ఈ సందర్భంగా కొత్తవాడలోని పద్మశాలి ఫంక్షన్ హాల్లో జరిగిన చేనేత పరిరక్షణ సదస్సుకు దేవులపల్లి సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు ప్రసంగిస్తూ ఎన్నికల ముందు ఎన్నో వాగ్దానాలు చేసి అధికారానికి వచ్చిన ప్రభుత్వం నేతన్నల పొట్ట కొట్టే విధానాలు చేపట్టడం దుర్మార్గమన్నారు. తమ ప్రభుత్వం ఇచ్చిన జీవోలనే విస్మరించి టెండర్ విధానం తేవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోకుంటే చేనేతలకు ఉపాధి కరువై రోడ్డున పడే దౌర్భాగ్యం పరిస్థితి దాపురిస్తుందన్నారు. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని.. చేనేతన్నలు

రాజకీయాలకతీతంగా చైతన్యంతో సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించనిచో నేతన్నల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. పిసిసి చేనేత సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత ప్రసంగిస్తూ ప్రభుత్వం ఏమాత్రం కాలయాపన చేయకుండ టెండర్ విధానాన్ని రద్దుచేసి చేనేత రంగాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమం ఉధృతమైతే అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. చేనేత నాయకులు పంతగాని శ్రీనివాసు, యెలుగం వెంకటములు, అడిగొప్పల సంపత్, యెలుగం సాంబయ్య, కొంగ వీరస్వామి, కొలిపాక మధునయ్య, భీమనాధుని సత్యనారాయణ, యెలుగం చిన్న భద్రయ్య, డాక్టర్ ప్రతాప్, కూరపాటి సంపత్ తదితరులు ప్రసంగిస్తూ ప్రభుత్వం టెండర్ విధానాన్ని రద్దు చేయకపోతే నేతన్నలకు ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు రోజులుగా మగ్గాలు బంద్ పెట్టిన ప్రభుత్వము స్పందించ పోవడం పట్ల వారు తీవ్ర అగ్రహాన్ని వ్యక్తం చేశారు. సదస్సులో మహిళలతో సహా చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిరసన దీక్షలు

టెండర్ విధానాన్ని రద్దుచేసి టెస్కో ద్వారానే బెడ్ షీట్లు కార్పెట్లు కొనుగోలు చేసేదాకా పోరాటాన్ని ఆపేది లేదని సదస్సు తీర్మానించింది. ఆరవ తేదీ శనివారం నుండి గోపాల స్వామి గుడి సెంటర్ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నిరసన దీక్షలు చేపట్టాలని నిర్ణయించి, కార్మికులు చేనేత శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సదస్సు పిలుపునిచ్చింది.

2025–26లో జీడీపీ వృద్ధి 7.7 శాతం

జాతీయం, ఆయుధం: భారత్ 2025-2026 ఆర్థిక సంవత్సరానికి 7.7 శాతం వృద్ధి రేటు నమోదు చేసింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 7.1 శాతంగా ఉంది. జనవరి మార్చి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి నమోదు చేసింది. ఈ మేరకు స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ మంత్రిత్వ శాఖ గణాంకాలను శుక్రవారం వెల్లడించింది.
2024-25 ఆర్థిక సంవత్సరంలో స్థిర ధరల వద్ద జీడీపీ రూ.229.89 లక్షల కోట్లుగా ఉండగా.. 202526 సంవత్సరంలో రూ.323.12 లక్షల కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. ప్రస్తుత ధరల వద్ద జీడీపీ 2024-25లో రూ. 318.07 లక్షల కోట్లు ఉండగా.. 2025-26లో అది రూ.346.36 లక్షల కోట్లకు చేరుకున్నట్లు పేర్కొంది.

అధికారం లేకున్నా పేదల పక్షానే కమ్యూనిస్టులు

(మొదటి పేజీ తరువాయి..)
ధనవంతులుగా ఎదుగుతున్నారన్నారు. కార్మిక, రైతు ఉద్యమాల సమీకరణ సిపిఐకే సాధ్యం అని, కేవలం రాజకీయ ఉపన్యాసాలకే పరిమితం కాకుండా సమాజంలోని అత్యంత వెనుకబడిన వర్గాలను బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా నాదు ఏకం చేసిందన్నారు. అల్ ఇండియా ట్రేడ్ యూనియాన్ కాంగ్రెస్(ఏఐటియుసి) కార్మికుల హక్కుల కోసం బ్రిటిష్ ప్రభుత్వ దోపిడికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా వందలాది మిల్లు కార్మికుల సమ్మెలను ముందుండి నడిపించిందన్నారు. సాయుధ, ప్రజా పోరాటాలు భారతదేశంలోని అనేక ప్రాంతాలలో బ్రిటిష్ పాలకులకు, వారికి మద్దతుగా నిలిచిన రాజులు, జమీందారులకు వ్యతిరేకంగా సిపిఐ చారిత్రాత్మక పోరాటాలను నిర్విహించిందన్నారు. నిజాం నవాబు క్రూర పాలనకు, దేశ్ ముఖ్ ల దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన పోరాటం భారత చరిత్రలోనే అతి పెద్ద రైతు విప్లవం అన్నారు. కమ్యూనిస్టులు అనేక పోరాటాలు చేసి జైలు జీవితం గడిపిన చరిత్ర ఉందని, పోలీసు లాఠీ, తుటాలకు ఏనాడు బెదర లేదని తెలిపారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టుల త్యాగాలు మరువలేనివన్నారు. భగత్ సింగ్ వంటి విప్లవకారులు కమ్యూనిస్టు భావజాలం వైపు ఆకర్షితులు కావవడం, దేశంలోనే అట్టడుగు వర్గాలైన కూలీలు, రాజకీయంగా చైతన్యవంతం చేయడంతో బ్రిటిష్ సామ్రాజ్యవాద పునాదులను కదలించడంలో సిపిఐ పార్టీ అగ్రభాగాన నిలిచింది అన్నారు. సిపిఐ పార్టీ తెలంగాణ ఉద్యమకారుల కోసం అసెంబ్లీలో మాట్లాడి కమిటీ దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించినందుకు నల్లబెల్లి తెలంగాణ ఉద్యమాకారులు ఆకుల సాంబరావు, పరికి కోర్నేల్, బట్టు సాంబయ్య, తంగెళ్ల భాస్కర్ ఆధ్వర్యంలో ఎంఎల్ఎ సాంబశివరావును ఘనంగా సన్మానం చేశారు. అనంతరం గ్రామ పంచాయితి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కార్మిక చట్టాలు అమలు చేసి కనీస వేతనాలు అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సిబ్బంది ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావుకు జన్ను సుదర్శన్, మామిడి సంపత్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. సిపిఐ వరంగల్ జిల్లా రాజకీయ శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా నల్లబెల్లి మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా పార్టీ కార్యదర్శి ఎస్ కె బాషుమియా, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, దండు లక్ష్మణ్, అక్కపెల్లి రమేష్,కందిక చెన్నకేశవులు, బద్రి తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టేలా బ్యానర్లు కట్టడం సరికాదు

- **ఈటలకు వ్యతిరేకంగా బ్యానర్లను ఖండిస్తున్నాం**
- **ఉమ్మడి వరంగల్ జిల్లా తెలంగాణ ముదిరాజ్ మహాసభ**

హనుమకొండ, ఆయుధం: హైదరాబాద్‌లో బీజేపీ నేత, మాజీ మంత్రి వర్యులు మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌కు వ్యతిరేకంగా కట్టిన బ్యానర్లను వరంగల్ ఉమ్మడి జిల్లా తెలంగాణ ముదిరాజ్ మహాసభ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు మహాసభ ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభ నేతలు చొప్పరి సోమయ్య ముదిరాజ్ రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ, రాజకీయ విభేదాలు ఉన్నా వ్యక్తిగత దూషణలు, రెచ్చగొట్టే బ్యానర్లు కట్టడం సరైన పద్ధతి కాదన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఈటల రాజేందర్ పోషించిన పాత్రను గుర్తు చేస్తూ, ప్రజా నేతగా ఆయనకు గౌరవం ఇవ్వాల్సిందేనని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు సమాజంలో చీలికలు తెస్తాయని, భవిష్యత్తులో ఇలాంటి రెచ్చగొట్టే కార్యక్రమాలకు పాల్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మహాసభ డిమాండ్ చేసింది. వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన అర్బన్ జిల్లా అధ్యక్షులు బయ్య సామి మాట్లాడుతూ ఈటెల రాజేందర్ తెలంగాణ ఉద్యమంలో గ్రామ గ్రామాన తిరుగుతూ తెలంగాణ

తేవటములో ఎంతో కృషి చేయడం జరిగిందని, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రులతో అసెంబ్లీలో పోరాడిన వ్యక్తి రాజేందర్ అని అన్నారు. అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్ మాట్లాడుతూ ఇంటికి వచ్చిన ప్రతి కార్యకర్తను ఏ విధంగా వారి బాగోగులు గుర్తించి వారికి అన్నం పెట్టి జాగ్రత్తగా ఇంటికి వెళ్లి రండి అని చెప్పి పంపించిన వ్యక్తి రాజేందర్ అన్నారు. అటువంటి వ్యక్తులపై అవహేళన పరచే విధంగా చూడడాన్ని తెలంగాణ ముదిరాజ్ మహా ఖండిస్తున్నది అన్నారు. హనుమకొండ జిల్లా అధ్యక్షులు బండి సారంగ పాణి మాట్లాడుతూ.. బీజేపీలో ఉన్న కొంతమంది వ్యక్తులు పని కట్టుకొని ఈటెల ను అవమానపరిచే విధంగా ఫ్లెక్సీలు పెట్టడం మంచి పద్ధతి కాదని.. రాబోయే రోజులలో ఎలాంటి అరాచకాలు చేపట్టిన ముదిరాజులందరూ ధర్నాలు చేయవలసి వస్తుందని హెచ్చరించారు. ఫ్లెక్సీలు కట్టిన వారిని గుర్తించి, శిక్ష పడేలా చూడాలని డీజీపీని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై రాష్ట్ర కన్వీనర్ శానబోయిన రాజకుమార్, వరంగల్ జిల్లా అధ్యక్షులు పొన్నం మొగిలి, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు చిల్ల సహదేవ్, భూపాల్ పల్లి జిల్లా అధ్యక్షులు జోర్క సదయ్య, జనగాం జిల్లా మత్స్యశాఖ అధ్యక్షులు నీల రాజు, ములుగు జిల్లా మత్స్యశాఖ అధ్యక్షులు సాదు రఘు, కోరబోయిన రవి, గ్రేటర్ వరంగల్ నాయకులు పుట్ట మహేందర్, భయ్యా శోభన్, గ్రేటర్ వరంగల్ ఉపాధ్యక్షులు బిల్ల శివశంకర్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు సంగినేని భీమ్రాజ్, కంబాల కోటి, ముదిరాజులు పాల్గొన్నారు.

మా హయాంలో పేపర్ లీక్‌లు జరగలేదే?

- **ఆప్ అధినేత, మాజీ సీఎం కేజ్రీవాల్**

జాతీయం, ఆయుధం: దేశంలో తరచూ తలెత్తుతున్న ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారాలపై ఆప్ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మరోసారి మండిపడ్డారు. ప్రశ్నాపత్రాల లీక్ వెనుక బిలియన్ల విలువ చేసే వ్యాపారాలు నడుస్తున్నాయని.. ఇందులో చాలా పెద్ద వ్యక్తుల హస్తం ఉందని ఆరోపించారు. భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే ప్రతి మూడేళ్లకు ఒకసారి పేపర్ లీక్‌లు ఎందుకు అవుతున్నాయని ప్రశ్నించారు. పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లైనా ఒక్క లీక్ కూడా జరగలేదన్నారు. తమ పార్టీ దిల్లీలో అధికారంలో ఉన్న పదేళ్లపాటు అక్కడ కూడా ఎటువంటి లీక్‌లు చోటుచేసుకోలేదని తెలిపారు. భాజపా అధికారంలోకి రాగానే ఈ లీక్‌లు మొదలయ్యాయని ఆక్షేపించారు.

సీపీఎంకు కు రాజీనామా సీపీఐలో భారీ చేరికలు

మహబూబాబాద్, ఆయుధం: మహబూబాద్ జిల్లాలోని గార్ల మండలానికి చెందిన సిపిఎం పార్టీకి చెందిన పలువురు నేతలు కార్యకర్తలు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూననేని సాంబశివరావు ఆధ్వర్యంలో సిపిఐ లో చేరారు. ఈ సందర్భంగా సిపిఐ కండువా కప్పి సాంబశివరావు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సిపిఐ చేసే పోరాటాలకు ఆకర్షితులై రాష్ట్రవ్యాప్తంగా సిపిఐలో పలువురు చేరుతున్నారన్నారు. జిల్లా కేంద్రంలో గార్ల మండలం సిపిఎం కు రాజీనామా చేసి సిపిఐ లో చేరినట్లు తెలిపారు. మహబూబాద్ జిల్లాలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని, మానుకోట జిల్లా ఉద్యమాలకు పుట్టినిల్లు అని అన్నారు. రాష్ట్రంలో సిపిఐ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారందరికీ సిపిఐ అండగా ఉంటుందని.. పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, జిల్లా సహాయ కార్యదర్శులు బి.అజయ్, సారధి రెడ్డి, నల్లు సుధాకర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్, రేశపల్లి నవీన్, గార్ల మండల కార్యదర్శి జంపాల వెంకన్న, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మాగం లోకేష్, మండల సహాయ కార్యదర్శి రాగం రమేష్, పార్టీలో చేరిన వారిలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిపిఎం జిల్లా కమిటీ మెంబర్ భూక్యా హరి నాయక్, మేదరమెట్ల గిరిప్రసాద్, సీపీఎం మాజీ మండల కార్యదర్శి అన్నం శ్రీనివాస్, భూక్యా పూల్ సింగ్, లక్కి, ఐద్వా మండల నాయకురాలు భూక్య పద్మ, మంగీలాల్, బానోతు వెంకన్న, భుక్య శ్రీను, వాంకుడోత్ సోమ్లా నాయక్ పార్టీలో చేరిన వారిలో ఉన్నా.రు

అడవుల పరిరక్షణతోనే పర్యావరణ సమతుల్యత

- **పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలి.**
- **అరుదైన ప్రాంతం ములుగు జిల్లా.**
- **రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క**

ములుగు, ఆయుధం: అడవుల పరిరక్షణతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని, సరస్సు, అటవీ, ఆధ్యాత్మిక, పర్వత పర్యాటక ప్రాంతాలు ఒకేచోట ఉన్న అరుదైన జిల్లాగా ములుగు ప్రత్యేక గుర్తింపు పొందిందని, రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగిన జిల్లా, నియోజకవర్గంగా ములుగు అగ్రస్థానంలో ఉందని, నియోజకవర్గంలో 77 శాతం, జిల్లాలో 64 శాతం అడవులు ఉన్నాయని తెలిపారు. మేడారాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్ది, అటవీ సంపదను భావితరాలకు అందించేందుకు సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.
99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ములుగు జిల్లా ఇంచర్ల ఏకో పార్క్‌లో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ముఖ్య అటవీ సంరక్షణాధికారి కాళేశ్వరం జోన్ బి. ప్రభాకర్ ఐఎఫ్ఎస్‌తో

కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా మంత్రి సీతక్క, సీసీఎఫ్ ప్రభాకర్, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్, ఇంచర్ల సర్పంచ్ కుమార్ గౌడ్ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటారు. రాష్ట్ర గేయాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అటవీ శాఖ ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను సందర్శించి, అటవీ సంపద సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ, వన్యప్రాణుల రక్షణకు సంబంధించిన చిత్రాలను వీక్షించారు.
ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, అడవుల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు. అటవీ సంరక్షణపై గ్రామస్థాయిలో ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వన సంరక్షణ కమిటీల తరహాలో గ్రామ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, స్థానిక యువతతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి అడవుల రక్షణ బాధ్యతలను అప్పగిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఇప్ప పువ్వుతో తయారయ్యే ఉత్పత్తులకు మంచి గుర్తింపు ఉందని, కంక వనాలు, ఇప్ప చెట్ల పెంపకంపై గిరిజనులకు శిక్షణలు అందిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగిన జిల్లాగా ములుగు జిల్లా నిలిచిందని, ములుగు నియోజకవర్గంలో సుమారు 77 శాతం అటవీ విస్తీర్ణం ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో సుమారు 64 శాతం అటవీ విస్తీర్ణంతో ములుగు రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉందని తెలిపారు. ఈ అటవీ సంపదను భావితరాలకు అందించేందుకు మరింత శ్రద్ధతో సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- **అదనపు కలెక్టర్ రవి**

హనుమకొండ, ఆయుధం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎల్కతుర్తి మండల కేంద్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ మరియు చెట్ల పెంపకం నేటి కాలంలో అత్యంత అవసరమని అన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్య ప్రభావాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, పచ్చని వాతావరణాన్ని అందించేందుకు సమాజంలోని ప్రతి వర్గం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు రూపొందించిన అవగాహన పోస్టర్‌ను అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రకృతి వనరుల సంరక్షణ, నీటి పొదుపు, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, చెట్ల పెంపకం వంటి అంశాలపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వహణలో ఎస్‌హెచ్‌జీ సభ్యులకు పారిశ్రామిక శిక్షణ

వరంగల్, ఆయుధం: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) మరియు మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులకు నాలుగు రోజులపాటు ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (EDP) శిక్షణ కార్యక్రమాన్ని నేటి నుండి నిర్వహించడం జరుగుతోంది. ప్రతి రోజు 120 మంది లబ్ధిదారులకు ఈ శిక్షణ అందజేస్తూ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో వ్యాపార అవకాశాలు, వ్యాపార నిర్వహణలో మెలకువలు, ఉత్పత్తుల మార్కెటింగ్, ఆర్థిక నిర్వహణ, వ్యాపార విస్తరణ వంటి అంశాలపై నిపుణులు సమగ్ర అవగాహన కల్పించారు. అలాగే పాల్గొన్న సభ్యుల సందేహాలకు సమాధానాలు అందిస్తూ వారికి అవసరమైన మార్గనిర్దేశం చేశారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందుబాటులో ఉన్న సబ్సిడీ పథకాలు, వాటి అర్హత ప్రమాణాలు, దరఖాస్తు విధానం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వహణకు అవసరమైన లైసెన్సులు, అనుమతులు, నాణ్యత ప్రమాణాలు తదితర అంశాలపై కూడా వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ వ్యాపారాలను మరింత సమర్థవంతంగా నిర్వహించి, ఆదాయ వృద్ధితో పాటు స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించుకునే అవకాశం కలుగుతుందని ఉప కమీషనర్ సమ్మయ్య తెలిపారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆమోదిత శిక్షణ భాగస్వామ్య సంస్థకు చెందిన నిపుణులు మోహన్ జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు సందీప్ కుమార్, శ్రీలత, జీడబ్ల్యూఎంసీ ఉప కమిషనర్ సమ్మయ్య, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ రమేష్‌తో పాటు సీఓలు రమా, రజిత, శ్రీలత, రాజ్‌కుమార్, ఖలీద్ పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695